# పెన్నేటి కతలు

ఆ పిల్లోని అస్సలు పేరు వాళ్ళమ్మా, నాయినకూ తప్ప మల్లెవరికీ తెల్దుగానీ ఊళ్ళో అందరికీ టంగుటూరోళ్ళ పిల్లోడంటే తెల్సు. ఏడుస్తా వుండేవాళ్ళకైనా ఆ పిల్లోని పడవ[1] సెప్తే, ఏడుపు ఇచ్చిపోయి మొకాన నగుపొద్దు పొడవాల్సిందే. అట్టాటోడు ఆ పిల్లోడు! పిల్లో డంటే మాట కట్టా అంటా వుండానను కొనేరు, పిల్లోడంటే పిల్లోడే. పదీ పదకొండేం డ్లుంటాయేమో, బక్కగా నల్లగావుండి, మిన మిన మెర్సే సూపుల్తో దేనిమీదా సిటికేసినంత సేపు సూపు నిలపకుండా బూలోకమంతా ఒక్కపారే సూస్తా వున్నట్టు వుంటాడు. ఊరోళ్ళ కండ్ల ముందే ఆ పిల్లోని అమ్మా నాయినా టంగుటూర్నుంచీ యీ ఊరికి ఎత్తి రావడం[2]... ఆ పిల్లోడిక్కన్నే పుట్టడం యిదంతా పదీపద్దైదేండ్ల కిందట జరిగిందే మల్ల. అయినా, ఆ పిల్లోని సూస్తావుంటే ఈ ఊరు పుట్టిన కాన్నుంచీ యిక్కన్నే యిట్టనే వుండా డనిపిస్తాది!

ఇంట్లో యెప్పుడుంటాడో తెల్దు. ఎప్పుడు బువ్వ తింటాడో, యెప్పుడు నిద్రబోతాడో తెల్దు. ఎప్పుడు యాడుంటాడో కూడా తెల్దు. వాళ్ళమ్మగానీ యెప్పుడన్నా ఆ పిల్లోన్ని కనుక్కో వాలంటే ఎన్ని తిప్పలు పడాల్నో పాపం! ''మా పిల్లోన్ని సూసివారా యాన్నన్నా'' అని అందర్నీ అడుగుతాబోవాల. ఇప్పుడే ఏట్లో కనపడెనని యెవరన్నా సెప్తే, ఏట్లోకి బోయేతలికి ''పలా నోళ్ళ సేలోవుంటే యిప్పుడే సూసినా'' అని అక్కడ యింగొకరు సెప్తారు. యాదున్నట్టు తెల్సి ఆడికిపోతే, ఆన్నుంచీ యింగోసాటికి పోయుంటాడు. తనయి కనపడ్తే తప్ప ఆ పిల్లోన్ని నర మానవులు కనిపెట్టలేరు. అయితే అందరికీ యాన్నో ఒక సాట కనపడ్తావే వుంటాడు.

పిల్లోడు గదా, పిల్లోళ్ళు ఆడుకొనే ఆట లేమన్నా ఆడ్తాడేమో అంటే అదీ లేదు. యీదుల్లో తోడి పిల్లోళ్ళు గోలి గుండ్లు, పుట్ట సెండ్లు, బంగరాలు ఆడ్తాంటే ఆడుండనే వుండడు. ఆటలు రాకపోడమట్టా పోనీండి. ఆ పిల్లోనికసలు యే ద్సడం నగడమైనా రావేమో అనిపిస్తాది. ల్యాకపోతే ... ఏడ్సంగా, నగంగా యెవురూ సూడకుండానే వుంటారా? మాటలు బాగా యమ్డున్[3] మాదిరి మాట్లాడ్తా డని వాళ్ళమ్మా నాయినా అంటారుగానీ, అది గూడా యిన్నోళ్ళు లేరబ్బా. ఇయన్నీ యెట్ట న్నాయెగానీ ఆ పిల్లోడు ఒక్కరోజు కనపడక పోతే, 'యెట్టపోయినా డబ్బా' అని అందరూ అనుకోవాల్సిందే.

ఏటిమీద మనిసికి మనిసి కనపడకుండా సిక్కంగ మంచు కుర్సేతప్పుడు, మొగోళ్ళు తలకు టువ్వాళ్ళు[4] సుట్టుకొనీ, ఆడోళ్ళు సెంగుకప్పుకొనీ నీళ్ళకోసం కడవలు తీసుకొని వస్తే ... అప్పటికింగా తెల్లవారింటాదో లేదో జాలుపక్కన కూకొని నీళ్ళల్లో సేపల్ను నిద్దర లేపుతాంటాడు ఆ పిల్లోడు! ఒక్కొక్కపారి పయిమీద సొక్కా గూడా వుండదు. ఎండలు మండి పోయేతప్పుడు ఏట్లో బుర్ద గుంతల కాడ కూకొని, బుర్దతో బొమ్మలుసేస్తానో, ఒంటి కాలి మీదుండే కొంగల్ను సూస్తానో వుంటాడు.

## ఊరి పిల్లోడు

మాంచి గాలికాలం ... సేలల్లో కుంటల్లోని నీరు యిగిరిపోతాంటే, సేద్యాలు సేసేవాళ్ళు గొంతులు ఆరిపోయి తట్టుకోల్యాక పోతాంటే యీ పిల్లోడు ఏ సెట్టు కిందనో కూకొని అంత గాలికి ఊగుతానే రెమ్మ మీదుండే ఏ పిట్టదిక్కో సూస్తావుంటాడు!

సేల మద్దెన లేసిన సుడిగాలి అబ్బాల[5] తిరుక్కుంటా పెరిగి పెరిగి ఆకాసెంలోకి వొగుడాకుల్ని యిసిరేస్తే ... ఆ ఎగిరేవాటి దిక్కు సూస్తావుంటాడు. యీదుల్లో తల్లి కోడి ప్యాడకడిని రొండు కాళ్ళతో సిదిగి సిదిగి పిల్లల్ని 'క్రూర్, క్రూర్' అని పిలిస్తే, దూది బొమ్మ లాల పిల్లలు పరుగెత్తేది సూస్తావుంటాడు. పొద్దున్నే బండ్ల బాటలో పుల్ల దుమ్ము మెత్తంగ గందప్పొడి మాదిరిగా వున్నట్టు కుక్క పిల్లలు పడిదొర్లుతా వుంటే సప్పుడుకాని నగుతో కూకొని అట్టనే సూస్తావుంటాడు. ఊరి మీదా ఊరి సుట్టూ ఆకాసెంలో గద్దలు సుట్లు తిరు గుతావుంటే, ఏటివార్న తుమ్మసెట్ల మీద రంగు రంగుల రెక్కల్తో జుమ్మున జీరంగులు వాల్తా లేస్తావుంటే ... కండ్లార్పకుండా సూస్తా వుంటాడు. రాత్రయేప్పటికి యీటున్నిట్లో దేన్ని



16-6-89

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 16-6-89

సూడల్యాకపోతానో అన్నట్టు పగలంతా తిరిగి తిరిగి సూస్తాడు. రాత్రయితే ఒరే యిట్నే యింతవరకూ సూడల్యాకపోతినే అన్నట్టు తెల్లవారీ వారంగదే బయల్దేరుతాడు.

అట్టాటోని నీళ్ళల్లో నుంచీ సేపను తీసి గడ్డన యేసినట్టు, వాళ్ళ నాయిన పొద్దుటూర్లో యెవురో సాములోరంట ఆయన ఆస్పెరంలో సదువుకోడానికని యిడ్సిపెట్టినాడు. కొడుకు ఎర్రోడయిపోతాడేమోని ఆయప్ప బయం. ఊళ్ళో అట్టా అనుకోడం గూడా నిజమేలే. ఆ సాములోరు కూడూ, గుడ్డా పెట్టి సదువు సెప్తాడని అక్కడ యిడిసొచ్చినాడు. ఆయప్ప కొడుకును తీసుకపోయి అక్కడ యిడ్సింది యెవరికీ తెల్దు. టంగుటూరోళ్ళ పిల్లోడు కనపల్లేదేమని ఒకర్నొకరు అడుక్కోని, అవతల వాళ్ళ నాయిన్ను అడిగితే అప్పుడు తెల్సె....
సదువుకొంటే మంచిదేలే, యిక్కడుంటే గాలికీ ఎండకూ తిరుగతా ఎందుకూ పనికిరాకుండా పోతాడుగదా... అనుకొన్రి.

అనుకొన్రిగానీ, ఆ పిల్లోడు కనపడకుండా పోతే అందరికీ యేందో తక్కువైనట్టాయె. యాడ సూసినా కనపడేవాడు యాడా కనపడకపోతే, యెట్టనో అయిపాయె. ఊళ్ళో మనుసులే గాదు, ఆకాసెంలో ఎగిరే పిట్టలు, బూమి మీద తిరిగే జంతువులు అన్నీ "టంగుటూరోళ్ళ పిల్లోడు యేడీ?" అని యెతుకుతా వున్నట్టు కనిపిస్తాయి.

రొండు వారాలయ్యే సరికి పిల్లోనికి ఆరోగ్గెం బాగా లేదనీ, జరమొస్తా వుండాదనీ జాబొస్తే, వాళ్ళ నాయిన పోయొచ్చినాడు, బాగనే వుండాడని సెప్పినాడు. మల్లవారానికే సాములోరే జాబు రాసినాడు-పిల్లోడు యిక్కడుంటే దక్కడు, యెంటనే తీసుకుపొమ్మని. ఆ జాబు సూసి ఆలూ మొగుడూ పరుగెత్తిపోయి కండ్లల్లో పానం పెట్టుకొని వున్న కొడుకును సెరింత దూరం మోసుకొంటా ఊరికి బయల్దేరిరి.

మబ్బు గప్పినోడు.[7] పడిపోయినట్టు వాళ్ళ నాయిన బుజం మీద తలకాయ యాలేసి పండుకొన్నాడు. సరిగ్గా ఊరి పొలిమేర తొక్కేతలికి ఆ మట్టి వాసన తట్టి లేపినట్టు కండ్లు తెర్సినాడు. ఇంగ అప్పట్నుంచీ తను పోయేతప్పటికున్నయన్నీ వున్నాయా, లేవా అన్నట్టు సూడడం మొదలుపెట్టినాడు. బుజం మీద కొడుకు కదలిక మోసుకొంటా వస్తున్న నాయినకు తెల్సుతా వుంది. ఊరంచుకు వచ్చేతప్పటికి, అంతవరకూ కువ్వగా యేసిన తీగెసుట్టను గుంజి బిగిస్తా వున్నట్టు భుజం మీదున్న సిన్న శరీరం నుంచీ వచ్చే పెద్ద తాకిడి! ఇంగ తట్టుకోలేనట్టు, నాయిన మెడకు పుల్లల మాదిరున్న రొండు సేతులూ సుట్టేసి "అబ్బ! ఎన్నాళ్ళకు మనూరి గద్దలు మళ్ళా కనపడె నాయినా" అనె.

కొడుకు మాటలు యిన్న అమ్మా నాయినకూ యెప్పుడన్నా అయితే నగు రావల్సిందే. అప్పుడు రాకపాయె, పైగా కండ్లు తడాయె! కొడుకు ఎర్రోడయితాడేమోని బయపడిన నాయిన యిప్పుడు ఎర్రోడయినాడనుకోవాల్సింది. అనుకోలా కండ్లల్లో నీటిని రెప్పల్తో, బుజంమీది కొడుకును రొండు సేతుల్తో అదిమిపట్టుకొని ... ఊర్లోకి, అవు... ఊర్లోపలికి, ఊరి కడుపులోకి తీసుకపోయినట్టు తీసుకపాయె.

-రామకృష్ణారెడ్డి

1. ప్రస్తావన 2. వలసరావడం 3. రెండవ ప్రపంచ యుద్ధం నాటి జర్మన్ యుద్ధ నౌక పేరు. మరుకైన వాళ్ళను అలా అంటారు. 4. తువ్వాలు. టవల్, తువ్వాలు కలిపి, ఫస్టోబర్ లాగా అయింది. 5. పిల్లలు గుండ్రంగా తిరుగుతూ ఆడే ఆట 6. ఎండిన జొన్న ఆకులు 7. మూర్ఛలో వున్నవాడు.

# 'తమస్' తర్వాత గోవింద్ నిహలాని టి.వి. సీరియల్

'తమస్' తరువాత దూరదర్శన్‌కు గోవింద్ నిహలాని చేస్తున్న సీరియల్ ఏమిటి? ప్రసిద్ధులైన విదేశీ రచయితల నాటకాలను, నవలలను, కథలను ఆయన చిన్న తెర మీదకు ఎక్కిస్తున్నారు. మూలకథ దెబ్బతినకుండా మన వాతావరణానికి అనుకూలంగా మలుచుకోగల వీలున్న రచనలను ఇందుకుగాను ఆయన ఎన్నుకుంటున్నారు. ఈ సిరీస్ కింద ఆయన బుల్లి తెరకు ప్రపంచ ప్రసిద్ధ రచయితలైన లోర్కా (స్పెయిన్), పిరాండెల్లో (ఇటలీ), బెర్టాల్డ్ బ్రెక్ట్ (జర్మనీ)ల రచనలను పరిచయం చేయనున్నారు. హెన్రీ ఇబ్‌సెన్ నాటకం 'లిటిల్ అయాల్ఫ్'ను ఆయన బుల్లి తెరకోసం 'దృష్టి' పేరిట తయారు చేశారు. రెండు గంటలపాటు సాగే ఈ నాటకాన్ని ఆయన 16 ఎం.ఎం.లో తీశారు. నితీష్‌రాయ్ ఈ నాటకానికి కళా దర్శకుడు. దిలీప్ సుబ్రహ్మణ్యం సంగీత దర్శకుడు. క్రిస్టియన్ నేపథ్యంలో సాగే ఈ నాటకంలో కొంత భాగం గోవాలో చిత్రీకరించారు. త్వరలోనే ఈ సిరీస్‌లో రెండవ నాటకం కూడా తయారుకానున్నది. లోర్కా నాటకం 'ది హౌస్ ఆఫ్ బెర్నార్డో ఎల్బా', పిరాండెల్లో నాటకం, కామూ వ్రాసిన 'క్రాస్ పర్పసెస్' నాటకాలను ఈ సిరీస్ కింద మన నేటివిటీకి అనుగుణంగా మార్చి నిహలాని బుల్లి తెరకు ఎక్కించనున్నారు. వర్తమాన రచయితలలో లబ్ధ ప్రతిష్ఠులైన స్ట్రిండ్ బెర్గ్ రాసిన 'ది ఫాదర్', మాక్స్ ఫ్రిష్ రాసిన



'ఫైర్ రైజర్స్' కూడా నిహలానీ నిర్దేశకత్వంలో బుల్లి తెర మీదకు రానున్నాయి. 'లిటిల్ అయాల్ఫ్' నాటకాన్ని ఇబ్‌సెన్ తన 66వ ఏట రాశాడు. ఆ తరువాత నాలుగు సంవత్సరాలకే ఆయన మృతి చెందాడు. చాలా సున్నితమైన కథా వస్తువు ఇది. మనుషుల్లోని జెలసీకి, అంతరంగ మథనానికి అద్దంపడుతుంది. ఢిల్లీలోని నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాకి చెందిన ఇర్ఫాన్, మీతా వశిష్ట్, నసీరుద్దీన్ షా భార్య రత్నా పాఠక్, జ్యోతి దేష్ పాండే, రజత్ కపూర్, ఆరు సంవత్సరాల స్వాప్నిల్ ఇందులో నటించారు. 'వీళ్ళల్లో చాలా మంది రంగస్థల కళాకారులే. అయితేనేం నటన విషయంలో గట్టి పిండాలు. "వాళ్ళ పని తీరు నాకు ఎంతైనా నచ్చింది. వీళ్ళల్లో నలుగురు అయిదుగురు అటు టెలివిజన్‌లోను, ఇటు కథా చిత్రాలలోను కూడా బాగా వెలుగులోకి రాగలరన్న నమ్మకం నాకుంది" అంటాడు నిహలాని. ●



ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 16-6-89